# నల్లచెరువులో ఆరేళ్ల పసి బాలుడు పై వీధి కుక్కల దాడి

**- బాలుడి ఆరోగ్యంపై పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించిన కమిషనర్**
**- పిల్లోడి ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రుల ఆందోళ..**
**-ఆరోగ్యం మెరుగుపడిందని చెబుతున్న వైద్యులు..**

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21,(ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలోని నల్ల చెరువు ప్రాంతంలో వీధి కుక్కలు దాడి చేయడం వల్ల తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆరేళ్ల పసి బాలుడు ఫణీంద్ర రెడ్డిని ఆరు వీధి కుక్కలు చుట్టూ ముట్టి ఇష్టం వచ్చినట్టు



దాడి చేశాయి. ఈ దుర్ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు రక్త స్రావం కావడంతో తల్లిదండ్రులు ఆగమేఘాల మీద వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిల్లోడి ఆరోగ్య పరిస్థితి తీవ్ర స్థాయిలో ఆందోళనకరంగా ఉందని క్యాజువాలిటీ వైద్యులు వెల్లడించినట్టు బాధితుడు తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ సంఘటన తెలుసుకున్న నగర



కమిషనర్ కే మయూరి అశోక్ వెంటనే సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డాక్టర్ లక్ష్మీనారాయణ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, జిజిహెచ్ సూపరెంటడెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో జిహెచ్ వైద్యులు రంగంలోకి దిగి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతానికి ఆ పసి పిల్లాడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు వెల్లడించారు.

అయితే ఈ దాడి సంఘటన చూశాక తమ పిల్లోడు పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించాక ఆ పసి పిల్లవాడు డిశ్చార్జ్ అయ్యేవరకు నిరంతర పర్యవేక్షణతో అధికారులతో సమన్వయంతో ఉండాలని కమీషనర్ సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ సంఘటన జరిగాక ఖి అయ్యా కమిషనర్ గారు మీ కార్పొరేషన్ అధికార సిబ్బంది ఇప్పుడే కళ్ళు తెరిచినట్టు ఉన్నారు ఖి అంటూ నగర ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. సుమారు పది నెలల క్రితం పసి పిల్లవాడు ప్రాణాలు పోయిన సమయంలో రెండు రోజులు తూతూ మంత్రంగా హడావుడి చేశారని, ఆ తర్వాత ఎన్నో సంఘటనలు నగరంలో జరిగిన అవి వెలుగులోకి రాలేదని, నిన్న శుక్రవారం నల్ల చెరువులో జరిగిన సంఘటనతో తిరిగి వీధి కుక్కలని పట్టుకునేందుకు రంగంలోకి సిబ్బంది రావటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ పది నెలల కాలంలో రోడ్లపై కుక్కలు విపరీతంగా ఉన్నప్పటికీ పట్టుకునే దిశగా అధికారులు అడుగులు వేగిపోవటం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కార్పొరేషన్ అధికారుల పనితీరు ఉందని విమర్శిస్తున్నారు.

గుంటూరు వార్త



## ప్రజలందరి సంపూర్ణ సహకారంతోనే

# స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం సాకారం

**వినుకొండ,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** ప్రజలందరి సంపూర్ణ సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణ ఆంధ్ర లక్ష్యం నెరవేరుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండలో సీఎం చంద్రబాబునాయుడు పర్యటించారు. స్థానిక ఎన్నార్టీ రోడ్డులోని ఎన్ఎస్పి మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద



స్వచ్ఛ రధా లను ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. అనంతరం ప్రజా వేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంగా రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిందన్నారు. భూమి,భూగర్భ జలాలు,వాతావరణం కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం,ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ఆ మొత్తం చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్నామని చెప్పారు. 2025 జనవరి నుంచి స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర




కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీల్లో 97 శాతం మేర ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం జరుగుతుందని గ్రామీణ ప్రాంతాల్లో మార్చి నాటికల్లా వంద శాతం మేర డోర్ టు డోర్ కలెక్ట్ చేస్తామని చెప్పారు. చెత్త,వ్యర్థాల నిర్వహణలో ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావాల్సి ఉందన్నారు. ఇంటి వద్ద వచ్చే చెత్తను కాంపోస్టు ఎరువుగా మార్చుకుని ఇంటిపైన పెట్టుకున్న మొక్కలకు ఎరువుగా వాడాలన్నారు. రాష్ట్రంలో 4,14,014 కుటుంబాలు హోం కంపోస్టు తయారు చేసుకుని టెర్రస్ గార్డెన్‌కు వినియోగిస్తున్నారన్నారు. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించడం,విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.జపాన్ పౌరుల తరహాలో చెత్త విషయంలో మనం కొన్ని అలవాట్లను మార్చుకోవాల్సి ఉందని ప్రజలందరి భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్,ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన తదితర నాయకులు అధికారులు పాల్గొన్నారు.



## గుంటూరు నగరంలో ఆగని వీధి కుక్కల దాడులు..

# పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం..

**స్వర్ణ భారతి నగర్‌లో నాలుగేళ్ల బాలుడి ప్రాణం తీసిన ఘటన మరవకుండానే..... నల్ల చెరువులో ప్రస్తుతం ఆరేళ్ల బాలుడి పై వీధి కుక్కల దాడి ఘటన సంచలనం రేకెత్తిస్తుంది..**

**-గుంటూరు నగరంలో వరుసగా జరుగుతున్న వీధి కుక్కల దాడి ఘటనలతో తల్లడిల్లి పోతున్న పసి హృదయాలు..**
**-నిద్ర మత్తులో కార్పొరేషన్ అధికార యంత్రాంగం.. సంబంధిత అధికారులు..**
**-వీధి కుక్కలను గుంపులుగా రోడ్లపైకి తెచ్చి ఆహారం అందిస్తున్న జంతు ప్రేమికులు..**
**-ఉన్నత న్యాయస్థానాల ఉత్తర్వులను గాలికి వదిలేస్తున్న అధికార యంత్రాంగం..**
**-దాడి చేసి ప్రాణాలు తీస్తున్న వీధి కుక్కలను ప్రోత్సహించే వారిపై చర్యలేవి..?**

గుంటూరు కార్పొరేషన్, ప్రభాతవార్త

గుంటూరు నగరంలో వీధి కుక్కలు చేస్తున్న దాడులకు పసిప్రాణాలు బలైపోవాల్సిన పరిస్థితి దాపురించింది.. పసి పిల్లలని టార్గెట్ గా చేసుకొని దాడి చేసిన ఘటనలలో కొంతమంది పిల్లల ప్రాణాలు బలైపోతున్న సందర్భం ఒకటైతే.. మరి కొంతమంది ఒళ్లంతా గాయాలై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఎదురవుతుంది... సాక్షాత్తు గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని 41 వ డివిజన్ లోని స్వర్ణ భారతి నగర్ లో సరిగ్గా 10 నెలల క్రితం ఐజాక్ అనే నాలుగేళ్ల



పసి బాలుడి పై దాడి చేసి గొంతు పీకను కొరికి వేసి ఆ బాలుడు ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఘటన మరిచిపోకుండానే... శుక్రవారం అర్ధరాత్రి నల్లచెరువు ప్రాంతంలో వీధి కుక్కలు ఆరేళ్ల పసి బాలుడి పై చేసిన దాడిలో ఒళ్లంతా గాయాలతో ఆ పసి బాలుడు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కొనప్రాణాలతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే సంజీవయ్య నగర్ లో రోడ్డుపై నడుచుకుంటూ వచ్చే ఒక బాలుడు చెవిని కొరికి వేసిన వీధి కుక్కలు...ఇలా వీధి కుక్కల దాడుల గురించి చెప్పుకుంటూ పోతే బయటికి రాని అనేక సంఘటనలు చాలానే ఉన్నప్పటికీ, ప్రతిరోజు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆగమేఘాలపై పరుగులు తీసుకుంటూ వస్తున్న వీధి కుక్కల కాటు బాధితుల సంఖ్య అధికారిక లెక్కల ప్రకారం గుర్తిస్తే ఎంతమంది అల్లాడిపోతున్నారో అధికారులతో పాటు ప్రతి ఒక్కరికి అర్థమైపోతుంది... దీనికి ప్రధాన కారణం కార్పొరేషన్ అధికారుల బాధ్యతరాహిత్యం, నిరక్ష్యం తో పాటు జంతు ప్రేమికుల పేరుతో కొంతమంది వీధి కుక్కలను గుంపులుగా రోడ్లపైకి వచ్చేలా చేసి వాటికి ఆహారం అందించే వారని చెప్పక తప్పని పరిస్థితి... నోరులేని జీవాలని జాలిపడటం తప్పుకానప్పటికీ అన్యాయంగా పసిపిల్లల ప్రాణాలను తీస్తున్న వీధి కుక్కలను ప్రోత్సహించటం ఎంత ఘోరమైన నేరమో ప్రతి ఒక్కరిని ఆలోచింపచేస్తుంది.. ఇప్పటికైనా సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి వీధి కుక్కలను జంతు ప్రేమికులు షెల్టర్ జోన్లను ఏర్పాటు చేసుకొని పోషించాలని ప్రజలు కోరుతున్నారు .



**గుంటూరు నగరం వీధి కుక్కల దాడులకు అడ్డాగా** మారిపోయిందనే విమర్శలు నగర ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లో ఏ ప్రాంతంలో చూసిన 20 నుంచి 30 వీధి కుక్కలు పైగా ఉన్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక పేటలో లైన్ కొచ్చి 10 వీధి కుక్కల వరకు ఉన్నా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఇళ్లల్లో నుంచి రోడ్లపై ఆడుకునేందుకు బయటకు వచ్చిన, తినుబండారాలు కొనుగోలు చేసేందుకు కొట్లు వద్దకు వెళ్లి వస్తున్నా కుక్కలు తమ పిల్లలపై ఎప్పుడు దాడి చేస్తాయోనని తమ గుండెల్లో వణుకు మొదలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి స్కూలుకు తీసుకొని వెళ్లే సమయంలో, తిరిగి ఇళ్లకు తెచ్చే సందర్భంలోను, కూరగాయల కొట్ల వద్దకు తీసుకొని వెళ్లే సమయంలో తాము పక్కనే ఉన్నప్పటికి వీధి కుక్కలు దాడికి పాల్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని అనేక మంది తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హఠాత్తుగా ఒక్కసారిగా పిల్లల మీదకు దాడులకు పాల్పడుతున్నాయని, ఈ కుక్కల దాడిలో చిన్నపాటి గాయమైన లబోదిబో మంటూ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరకు ఇళ్లలో పెంచుకునే కోళ్లు, మేకలు, గేదెలపై కూడా ఒకేసారి గ్రూపుగా వలయాకారంగా ఐదు ఆరు కుక్కలు దాడి చేయడం నిత్యం జరుగుతుందని చెప్తున్నారు. వీధి కుక్కల నియంత్రణలో కార్పొరేషన్ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో విఫలం చెందారు అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జంతు ప్రేమికుల అత్యుత్సాహంతో ఎంతోమంది పసిబిడ్డల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, అనేకమంది వీధి కుక్కల కాటుకు బాధితులుగా మారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నగర ప్రజలు వెల్లడిస్తున్నారు. ఎప్పటికైనా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కోర్టు ఉత్తర్వులను అమలు చేసే విధంగా అధికారులు కఠిన వైఖరి అవలంబించాల్సిన పరిస్థితి అవసరమని స్పష్టం చేస్తున్నారు.

**నాలుగేళ్ల బాలుడి ప్రాణం తీసిన వీధి కుక్కల ఘటన మరువకుండానే.**

గుంటూరు నగర కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ కి చెందిన స్వర్ణ భారతి నగర్ లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ నాగరాజు, రాణిలకు చెందిన నాలుగేళ్ల పసి బాలుడు ఆదివారం పూట ఇంటి పక్కనే ఉన్న చర్చి వద్దకు వెళ్లి >> 11

# రేపటి నుండి ఇంటర్మీడియెట్ పరీక్షలు

పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: ఈ నెల 23వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. పట్టణంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో సుజాత జూనియర్ కళాశాలలో-262మంది విద్యార్థులు, నిడుబ్రోలు పిబిఎన్ కళాశాలలో-264మంది విద్యార్థులు, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో-275మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయా కళాశాలల అధికారులు తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు సంబంధించి 23వ తేదీన తెలుగు, సంస్కృతం ఇతర భాషలు,25న ఇంగ్లీషు, 27న బోటనీ, హిస్టరీ, మార్చి 2న గణితం, 5న గణితం-1బి, జువాలజి, 7న ఎకనామిక్స్, 10న ఫిజిక్స్, 12న కామర్స్, సోషియాలజి, ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించిన పరీక్షలు, 14న సివిక్స్, గణితం-1బైపీసి విద్యార్థులకు, 17న కెమి స్ట్రీ, 21న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్, 24న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పేపర్-1 జరుగుతాయన్నారు. ద్వితీయసంవత్సరంకు సంబంధించి 24న లాంగ్వేజ్ పేపర్,26న ఇంగ్లీషు పేపర్-2, 28న బోటనీ, హిస్టరీ పేపర్-2, మార్చి 4న గణితం



పేపర్-2ఎ, సివిక్స్ పేపర్-2, 6న జువాలజీ, ఎకనామిక్స్ పేపర్-2, 9న గణితం పేపరు-2బి, 11న కామర్స్, సోషియాలజి,ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించిన పేపర్లు జరుగుతాయన్నారు.13న ఫిజిక్స్-2, 16న మోడరన్ లాంగ్వేజ్, జాగ్రఫీ, బ్రిడ్జికోర్సు పేపర్లతోపాటు గణితం-2 బైపీసి విద్యార్థులకు సంబంధించి జరుగుతాయన్నారు. 18న కెమిస్ట్రీ-2, 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, లాజిక్ పేపర్-2పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులందరూ నిర్ణీత సమయానికంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు కోరారు.

# ప్రజల అభివృద్ధి,సంక్షేమంపై దృష్టి పెట్టే విధంగా చట్టసభలను ఉపయోగించాలి : మంత్రి నాదెండ్ల

**తెనాలి టౌన్, ఫిబ్రవరి21, (ప్రభాతవార్త):** రాజకీయలబ్ధి కోసం దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగాడాన్ని తీవ్రంగా ఖండించాల్సిన చర్యని, స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ,శాసనమండలి వేదికగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యానికి, ప్రజల మనోభావాలకు విరుద్ధమని,చట్టసభలు ప్రజల సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై చర్చించే గౌరవనీయ వేదికలు కావాలన్నారు.రాజకీయ దురుద్దేశంతో మతాన్ని, భక్తుల భావోద్వేగాలను ఉపయోగించడం అత్యంత దురదృష్టకరమన్నారు.భక్తుల మనోభావాలు దెబ్బతినేలా,మతాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించడం సమాజంలో చీలికకు దారితీస్తుందని హెచ్చరించారు.భారత రాజ్యాంగం ప్రతి మతాన్ని సమానంగా గౌరవించాలనే స్ఫూర్తిని మనకు అందించిందని గుర్తుచేశారు.ఈ ఘటనపై జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ, మరియు భారతీయ జనతా పార్టీ తరఫున తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నానన్నారు.భారతదేశ చరిత్రలో చట్టసభల్లో ఇలాంటి ఘటనలకు దాఖలాలు లేవని పేర్కొన్నారు.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మెప్పుకోసం దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగడం ఖండనీయమని అన్నారు.ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టే విధంగా చట్టసభలను ఉపయోగించాలని సూచించారు.ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొన్న వారు బేషరతుగా క్షమాపణ చెప్పి ప్రజల కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నేతలు, వీర మహిళలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాలుడుని పరామర్శించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** తన నియోకవర్గ ప్రజలకు ఏ చిన్న కష్టమొచ్చినా కంటికి రెప్పలా కాపాడుకునేందుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ముందుంటానని మరోసాని నిరూపించుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో నల్లచెరువు ప్రాంతానికి చెందిన శివారెడ్డి, గౌతమి కుమారుడు ఫణీంద్ర రెడ్డిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో బాలుని తల్లిదండ్రులు వెంటనే గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నసీర్ అర్ధరాత్రి సమయంలోనే హుటాహుటిన బయలుదేరి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. బాలుని పరిస్థితిని గమనించి సంబంధిత వైద్యులతో మాట్లాడారు. బాలుని ప్రాథమిక చికిత్స పూర్తయ్యే వరకు సుమారు అర్ధ గంటకుపైగా ఆస్పత్రిలో ఉన్నారు. బాలునికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. భయపడాల్సిన పని లేదని, తాను అండగా నిలబడతానని బాలుని తల్లిదండ్రులకు ధైర్యం కల్పించారు. వారికి తన వంతుగా కొంత ఆర్థిక సాయం అందించారు. గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు మునిసిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, బాలునికి మంచి వైద్యం అందిస్తామని తెలిపారు.



## లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాల పంపిణీ



**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండలంలోని గంగడిపాలెం పంచాయతీ శివారు జొన్నావారిపాలెంలో 2009 సంవత్సరం నుండి పంపిణీకి నోచుకోని ఇళ్ళస్థల పట్టాలను శనివారం రేపల్లె తహాశీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్‌ల సహకారంతో నివేశనస్థల పట్టాల సమస్యకు పరిష్కారం లభించిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గంగడిపాలెం సర్పంచ్ చిప్పల పార్థసారధి, గంగడిపాలెం పంచాయతీ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు నాయుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## సామ్రాజ్యవాదులను ప్రతిఘటించాలి



**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** సామ్రాజ్య వాదులను సంఘటితంగా కార్మికులు ప్రతిఘటించాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో రెడ్ బుక్ డేలో భాగంగా సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ అనే గ్రంథం ఉమ్మడి పఠన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ 1848లో కారల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగిల్స్ రచించిన గ్రంథంలో ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా కార్మికుల శ్రమను అపహరిస్తున్నారో స్పష్టం చేశారన్నారు. కమ్యూనిస్టుల ప్రణాళికతో పెట్టుబడిదారులు భయపడిన నేపథ్యంలో ప్రపంచస్థాయిలో రెడ్ బుక్ డేగా జరుపుకుంటున్నామని మణిలాల్ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలు పరిశుభ్రత ప్రాధాన్యతను గుర్తించాలి : రేపల్లె ఆర్డీవో ఎన్ రామలక్ష్మి

**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రజలు గుర్తించాలని రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం రేపల్లె పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే చెత్తను పడవేయాలన్నారు. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా





వర్గీకరించాలని ఆమె సూచించారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతతో మెలగాలన్నారు. రేపల్లె పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది, ప్రజల సమిష్టి కృషి ఎంతైనా అవసరమని రామలక్ష్మి వెల్లడించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మైనేని సీతారామయ్య విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రాద్ సోదరుడు, తెలుగుదేశం పార్టీరేపల్లె నియోజకవర్గ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.మంగ, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివ రావు, రెవెన్యూ, మున్సిపల్, వైద్య శాఖల సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని గరువురోడ్డులో అర్బన్ హెల్త్ సెంటరు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సుభాషణ్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకరమైన జీవనం

### ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**వేమూరు ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) :** సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించగలుగుతామని, గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్య అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. శనివారం నియోజకవర్గ కేంద్రం వేమూరులో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయితీ సర్పంచ్ శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో గ్రామాల్లో పారిశుద్ధ్యం సక్రమంగా అమలు జరిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. అదే రీతిలో ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం వంతమైన జీవనం కొనసాగించగలుగుతారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. అంతకుముందు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ర్యాలీ అనంతర మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జరీనా పర్వీన్, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గాజుల



వెంకటసుబ్బయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అంశెట్టి కిషోర్, డిప్యూటీ ఎంపీడీవోలు కోటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, ఏపీఎం శోభన్, పంచాయితీ కార్యదర్శి భూపతిరెడ్డి, టిడిపి నాయకులు బండారు సూరిబాబు, వేల్పుల రవి ప్రసాద్, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రేపల్లె సబ్ జైలు తనిఖీ

**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పట్టణంలోని సబ్ జైలును శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎస్‌పిడి వెన్నెల తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఖైదీలకు



అందించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. న్యాయ సహాయం పొందే నిబంధనల గురించి వెన్నెల వివరించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాల గురించి జైలు శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ, జైలు, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు

## మాతృభాషను గౌరవించాలి

**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మాతృ భూమి, మాతృమూర్తి, మాతృ భాషను గౌరవించాలని రేపల్లె రసాలయ కళాసమితి కార్యదర్శి కోడె గౌరీశంకర్ అన్నారు. శనివారం రసాలయ కళాసమితి, రామకృష్ణ విద్యా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభకు మల్లెల రామచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోడె గౌరీశంకర్ మాట్లాడుతూ ఉద్యోగం కోసం ఇతర భాషలను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను మరచిపోరాదని చెప్పారు. దేశభాషలందు తెలుగులెస్స అన్న శ్రీకృష్ణ దేవరాయలను గుర్తు చేసుకోవాలన్నారు. తెలుగుకు ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనే నానుడి ఉన్నదని గౌరీశంకర్ అన్నారు. పద్యం తెలుగువారి సొత్తు అని, తెలుగులో సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం వంటి నాటకాలు విదేశాలలో సైతం ప్రసిద్ధిచెందాయని ఆయన చెప్పారు. కోడె సరోజిని దేవి జ్ఞాపకార్థం రూ.5 వేలు విరాళాన్ని రామకృష్ణ విద్యా నిలయానికి గౌరీశంకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు శ్రీనివాసరావు, కె.రవిబాబు, ప్రసన్నాంజనేయులు, బి.రమాదేవి, కె.జగన్మోహనరావు, నటరాజ్, వై.బుచ్చిరావు, వి.



మస్తాన్‌రావు, కె.రాంబాబు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. మాతృభాష గొప్పతనంపై ప్రతి వ్యక్తికి అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్ చెప్పారు. నిమిషంపాటు తెలుగులోనే మాట్లాడిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి

**నగరం, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. శనివారం నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పాఠశాల విద్యర్థులతో పరిశుభ్రతపై అవగాహన ర్యాలి నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచు



కోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకర ంగా జీవించాలని నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల పరిశరాలు, రహదారులు వద్ద చెత్తను తొలగించి, పొడి, తడి చెత్త వేరుచేయటం, పారిశుద్ధ్య నియమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామాంజనేయులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధ్యయలు, విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ ఛైర్మన్ యార్లగడ్డ గోపి

**వేమూరు ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలోని అనంతపురం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై బిజెపి కార్యకర్తలు చేసిన దాడులు అప్రజాస్వామికమని ఇటువంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ ఛైర్మన్ యార్లగడ్డ గోపి పేర్కొన్నారు. శనివారం వేమూరులో విలేఖర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై బిజెపి నాయకులు చేసిన దాడులు, ప్రజాసా ్వమ్య వ్యవస్థకు మాయని మచ్చ అని అన్నారు. అధికార అహంకారంతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం బీజెపి నాయకులు చేస్తున్నారు



అని ఆరోపించారు. భారత జాతి ప్రయోజనాలను కాపాడమంటే పార్టీ ఆఫీసుల మీద దాడులా అని ప్రశ్నించారు. మోడీ దేశాన్ని అమ్ముతున్నారని విమర్శిస్తే దేశద్రోహమా. మోదీని ప్రశ్నిస్తే దేశాన్ని ప్రశ్నించినట్టా? అని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడికి రాజ్యాంగ కల్పించిన హక్కు అని ఆ హక్కును అణచివేయడం దాడులు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రైతులు గిట్టుబాటు ధరలు కోరుతున్నా పట్టించుకోకపోవడం, ఉద్యోగాల హామీలు నెరవేర్చకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేతుల్లోకి అప్పగించడం వంటి అంశాలపై ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. అనంతపురం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై దాడులు, బెదిరింపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నమని, ఇలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ తరపున తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, అదే విధంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని యార్లగడ్డ గోపి స్పష్టం చేశారు.

## ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తాం

### జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రేపల్లె పట్టణంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం రోడ్‌లో



నెహ్రూ, ఎన్టీరామారావు విగ్రహాల ఎదుట నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.36 అమలుచేసి 2019, 2024 సంవత్సరాలలో పెండింగ్ లో ఉన్న వేతన సవరణ పూర్తి చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి మంజూరు చేయాలని కార్మికులు కోరారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యూటీ సీలింగ్ రూ.2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని గ్రాట్యూటీ చట్టాన్ని అమలుచేసి చట్ట ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని సూచించారు. సహకార సంఘాలలో విధులను నిర్వర్తించే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ కాలాన్ని 62 సంవత్సరాలుగా నిర్ణయించాలని యూనియన్ డిమాండ్ చేసింది. రూ.5 లక్షల ఆరోగ్య భీమా సదుపాయం కల్పించి విధి నిర్వహణలో మృతి చెందితే ఆ ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల జీతభత్యాలను డ్యూటీ పద్దుల నుంచి రద్దు చేయాలని కార్మికులు కోరారు. 2019 సంవత్సరం తర్వాత సహకార సంఘాలలో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీఓనెం.36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్‌ల ద్వారా కాకుండా డిసిసిబిల ద్వారా రైతులకు నేరుగా రుణాలిస్తున్నందున పిఎసిఎస్‌లు నిర్వీర్యమవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన వెలుబుచ్చారు. అదే విధంగా సంఘాలు చెల్లించిన షేరు ధనంపై కనీసం 6 శాతం డివిడెండ్ లేదా 6 శాతం వడ్డీ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డి.ఎల్. ఎస్. ఎఫ్‌ను ఆప్కాబ్, డిసిసిబిల, పిఎసిఎస్‌లతో ఏర్పాటు చేసి 3 సంవత్సరాల నిబంధన కాకుండా నిరవధికంగా కొనసాగించి బదిలీలు చేయాలని కోరారు. నిబంధనలతో సంబంధం లేకుండా జీతభత్యాలను డిఎల్ఎస్ఎఫ్ ద్వారా నిరవధికంగా చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్స్ క్లర్క్స్, కంప్యూటర్ ఆపరేటర్లను సీనియారిటీ ప్రాతిపదికన జిల్లాలో ఖాళీగా ఉన్న సిఇఓ పదవులలో నియమించాలని విజ్ఞప్తి చేశారు. డిఎల్ఇసి ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయాలని జెఎసి నేతలు స్పష్టం చేశారు. జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2051 సహకార సంఘాలు ఆందోళన బాటపట్టాయని చెప్పారు. 8 వేల మంది

## పాస్టర్లు సువార్తను విరివిగా ప్రజలకు అందించాలి

**తెనాలిమున్సిపాలిటీ, ఫిబ్రవరి 21, (ప్రభాతవార్త):** పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెనాలి మాస సమావేశాన్ని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్, డాక్టర్ పినపాటి జాన్ పాల్ ఆధ్వర్యంలో గ్రేస్ కాంపౌండ్ లో గల రాక్ గాస్పుల్ చర్చిలో నిర్వహించారు. శనివారం పట్టణంలోని మారిస్ పేటలో గల పినపాడు రోడ్డు లోని రాక్ గాస్పుల్ చర్చిలో నిర్వహించిన అసోసియేషన్ మాస సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్, డాక్టర్ పినపాటి జాన్ పాల్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ లు అతిథులుగా హాజరయ్యారు. సభలో అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పాముల పరంజ్యోతి మాట్లాడుతూ, నీ ముందు నడుచువాడు యెహోవా అనే వాక్యపదేశం తెలియజేశారు. పాస్టర్లు ఐక్యతతో నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు. అసోసియేషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకునే పాస్టర్లకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ మాట్లాడుతూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా అందరికీ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అవసరతంలో ఉన్న దైవ సేవకులకు ఆర్థిక చేయూత సైతం అందజేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నిన్ను వలె నీ పొరుగు



వారిని ప్రేమించుము అన్న సూక్తి ప్రకారం అసోసియేషన్ లోని ప్రతి సభ్యుడికి సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ, పాస్టర్లకు దేవుని సువార్త అందించటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్న అభిప్రాయాన్ని తెలియజేశారు. దేవునిపై నమ్మకం ఉంచి దేవుని సేవ చేసే వారికి ప్రత్యేక ఆశీర్వాదాలు లభిస్తాయి అన్నారు. ఈ సభలో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్ గత సమావేశపు జమ ఖర్చుల వివరాలను తెలియజేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పలువురు దైవ సేవకులు ప్రార్థనలు చేశారు. సమావేశానికి హాజరైన పాస్టర్లకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ నిర్వహించగా, ప్రార్థన ఆశీర్వాదాలు అందించే కార్యక్రమాన్ని అన్నం ఆదాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్, గౌరవాధ్యక్షులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, ప్రతినిధులు విలియం కేరి, గడ్డం జాన్ బాబు, షడ్రక్, పొదిల ఏసోబు, శ్రీకాంత్, జె ప్రభు దాసు, చిలక జాన్ వరప్రసాదరావు, రజనీకాంత్, మరియు ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## ఆడ పిల్లలు మన ఆస్తి : సివిల్ జడ్జి పవన్‌కుమార్

**కొల్లూరు, ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) :** ఆడ పిల్లలు భారం అనుకునే ఆలోచన తీరును తల్లిదండ్రులు మార్చుకోవాలని తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో న్యాయసేవా అధికార



సంస్థ శ్రీశిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన బాలికల సంరక్షణ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సివిల్ జడ్జి పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలు అనేక రకాలుగా వేదింపులకు గురవుతున్నారు అన్నారు. ఆన్లైన్లో సైతం వేదింపులకు గురవుతున్నారన్నారు. చట్టాల గురించి కేవలం బాలికలకే కాకుండా బాలురకు సైతం అవగాహన నిర్వహించాలని అన్నారు. ప్రధానంగా ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించి పర్యావసరాల గురించి చెప్పాలన్నారు. బాలికల భద్రత కేవలం తల్లిదండ్రులకే కాక ప్రభుత్వాలు బాధ్యత వహించాలని అన్నారు. బాలికలు లేకుంటే సమాజ మనుగడ అసాధ్యమన్నారు. బాలికలకు విద్యను అందించడం జాతీయ సాధికారత వైపు నడిపించడమే అవుతుందన్నారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు కలసికట్టుగా పని చేయాలన్నారు. నీరు లేకుండా ప్రపంచ కూడా అసాధ్యమే, అలాగే బాలికలు లేకుంటే సమాజం మనుకూడా అసాధ్యమన్నారు. సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ వివిధ రంగాలలో మహిళలు రాణిస్తున్నారు. చట్టాలను కఠినంగా అమలు చేస్తే బాధితులు స్వేచ్ఛగా ధైర్యంగా ఫిర్యాదు చేసే పరిస్థితి ఉంటుందన్నారు. బాల్య వివాహాలు జరపటం చట్టరీత్యా నేరం న్నారు. డిడిఓ పద్మ మాట్లాడుతూ బాలికలకే కాకుండా మగ పిల్లలకు కూడా చట్టాల గురించి తెలియజేయాలన్నారు. మగ పిల్లల కంటే ఆడపిల్లలు తల్లిదండ్రులను చక్కగా చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరసింహారావు, ఎంఈవో జ్యోతి, ఏపీఎం రాము, ఎస్ఐ కోటేశ్వరరావు, వైద్యాధికారి కావ్యతేజ, సూపర్‌వైజర్లు సునీత, శకుంతల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## విద్యార్థుల స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ

**రేపల్లె, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆధ్వర్యంలో జీరో లిట్టర్



గవర్నెన్స్ కార్యక్రమం జరిగింది. కళాశాల పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలలో తడి, పొడి చెత్తను వేరు చేసిన విద్యార్థులు చెత్త బుట్టల్లో నింపారు. పరిశుభ్రత పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐక్యూఎసి, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.దాసు మాట్లాడుతూ పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సేవాదృక్పథంతో ముందుకు సాగుతున్న కళాశాల విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవిచంద్రకుమార్, ఎన్‌సిసి ఎఎన్ఓ కె.బాలగురవయ్య, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఇండీ ఫిలింఫెస్టివల్ అవార్డులు అందుకున్న పూర్ణచంద్, రత్నాకర్




**తెనాలి టౌన్, ఫిబ్రవరి 21, (ప్రభాతవార్త):** గ్లోబల్ ఇండీ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, దాశరథి థియేటర్ సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లోని దాశరథి థియేటర్‌లో గ్లోబల్ ఇండీ ఫిలింఫెస్టివల్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఫెస్టివల్ నిర్వాహకులు, సినీ దర్శకులు రామ్ రావిపల్లి అధ్యక్షత వహించిన ఈవేడుకల్లో తెనాలి పట్టణానికి చెందిన, ఈదర వేంకట పూర్ణచంద్ రీబూట్ లఘు చిత్రాన్ని నిర్మించినందుకు బెస్ట్ ప్రొడ్యూసర్ గా, శిశిరం చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న వరల్డ్ రికార్డ్ హోల్డర్ కనపర్తి రత్నాకర్ బెస్ట్ మ్యూజిక్ వీడియో విభాగంలో బెస్ట్ డైరెక్టర్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వి.ఎన్ ఆదిత్య, చంద్రమహేష్, రాజా వన్నం రెడ్డి, సినీ రచయిత నివాస్, సినీ పాటల రచయిత స్వామి నాయుడు, టీవీ ప్రొడ్యూసర్ విజయదుర్గా, దాశరథి థియేటర్ కార్యదర్శి వినయ్ కుమార్ ల చేతుల మీదిగా వెంకట పూర్ణచంద్, రత్నాకర్ లు అవార్డులు అందుకున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఫిల్మ్ ఫెస్ట్ లో పలుభాషలకు చెందిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ ఈదర బ్యానర్ పై మరిన్ని సందేశాత్మక చిత్రాలను నిర్మిస్తామన్నారు. రత్నాకర్ మాట్లాడుతూ, తనను ప్రోత్సహిస్తున్న నిర్మాతలు ఈదర వేంకట పూర్ణ చంద్, అమిరినేని వెంకట్ ప్రసాద్, సాధు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి, మ్యూజిక్ డైరెక్టర్ శాండీ అద్దంకి, గాయని భవ్య, పాటల రచయిత సురేంద్ర రొద్ద, నటీనటులకు, సాంకేతక నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు అందుకున్న వెంకట పూర్ణచంద్, రత్నాకర్ లను శనివారం పలువురు కళాకారులు అభినందించారు.

## నేడు అవగాహన..లో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈఆదివారం మెదడు, నరముల సంబంధిత వ్యాధులపై సభ ఏర్పాటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. ఈ ఆరోగ్యసభలో సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ అమూల్య ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు. ఆరోగ్యాభిలాషులందరికీ ఉపయోగకరంగా ఉండే ఈ 383వ అవగాహన ఆదివారం ఆరోగ్యసభకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాఏపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేసిన మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి

**తెనాలి టౌన్, ఫిబ్రవరి21, (ప్రభాతవార్త):** ఎలాంటి సభ్యత్వరుసుం తీసుకోకుండా ఉచితంగా ఖిమాఏపీఖి కార్డులను జారీచెయ్యడ పారదర్శకతకు ప్రతిరూపమని, మాజీమంత్రి, రాష్ట్ర మహిళా కమీషన్ మాజీ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. స్థానిక మాఏపి కార్యాల్నయలో 2026 సంవత్సర తొలి కార్డులను శనివారం అమె మహిళా ఆర్టిస్టులకు జారీచేశారు. ఇటీవల తెనాలిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకల పోటీల్లో ఉత్తమ నటిగా జ్యూరీ ఎన్నికచేసిన జంగారెడ్డిగూడెంకు చెందిన సుజిత, ఉత్తమ కేరెక్టరు నటిగా అవార్డు అందుకున్న పాలకొల్లు సాయి ప్రకర్ష లకు ఖిమా ఏపీఖి సభ్యత్వం కార్డులను నన్నపనేని రాజకుమారి అందచేశారు. ఈ సంధర్భగా రాజకుమారి మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ లో సినీపరిశ్రమ అభివృద్ధి కోసం దిలీప్ రాజా చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. ముఖ్యమంత్రికి ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధి గురించి మాట్లడతానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైనున్న గౌరవంతో గతంలో తన దర్శకత్వంలో విడుదలయిన ఖి పందుగాడి ఫోటో స్టూడియోఖి సినిమాను పూర్తిగా ఆంధ్రాలోనే దిలీప్ రాజా చిత్రీకరించారన్నారు. కార్డుల పేరుతో కొందరు లక్షల రూపాయలు వసూలుచేస్తున్న సంస్థలపట్ల ఔత్సాహిక కళాకారులు అప్రమ్నత్తగా ఉండాలని ఆమె సూచించారు. మాఏపీ వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ, అర్హతగల నిజమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు మాత్రమే మాఏపి 2024 నుండి ఎలాంటి సభ్యత్వ




రుసుం తీసుకోకుండా కార్డులను జారీచేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ లో సినిమా షూటింగ్ లు జరగాలనే ధ్యేయతో మూవీ ఆర్టిస్ట అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ పనిచేస్తుందన్నారు. తమ గమ్యం గమనం లక్ష్యం ధ్యేయం ఆంధ్రాలో పునర్వవస్తీకరణ చట్టంమేరకు పరిశ్రమస్థిరపడటమేనని ఆయన వివరించారు. లఘు చిత్రాల ఉత్తమ నటి సుజిత మాట్లాడుతు, సినిమాల్లో నటించడానికి మాఏపి పెదబాలశిక్షగా పనిచేస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేసారు. కేరెక్టరు నటి సాయి ప్రకర్ష, మంజులూరి లక్ష్మీపతి, శ్రీదేవి, రామలక్ష్మి ,నటుడు వంశీ, అసిస్టెంట్ డైరెక్టర్ గాజులపల్లి రాముడు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా థింగ్‌క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయంలోని డీన్ ఏఏపీ-ఎఫ్ఏ కార్యాలయం, విజ్ఞాన్స్ టీబీఐ కౌన్సిల్, ఈ-సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నాస్కామ్ ఫౌండేషన్,



సిస్కోల ఆర్థిక సౌజన్యంతో కోహోర్ట్-9కోసం నిర్వహించిన థింగ్‌క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్‌ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక ఆవిష్కరణలు పెంపొందించి, ప్రారంభ దశ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాస్కామ్ ఫౌండేషన్ సోషల్ ఇన్నోవేషన్ ఫర్ యూత్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రేయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు థింగ్‌క్యూబేటర్ కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలు, ఎంపిక విధానం, ప్రాజెక్ట్ అభివృద్ధి దశలు తదితర అంశాలను వివరించారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సామాజిక సమస్యలకు పరిష్కారాలుగా మలచుకోవాలని సూచించారు. సిస్కో సిస్టమ్స్, నాస్కామ్ ఫౌండేషన్ సంయుక్తగా నిర్వహిస్తున్న థింగ్‌క్యూబేటర్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థి ఆవిష్కర్తలను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన 100మంది విద్యార్థి ఆలోచనలకు ప్రోటోటైప్ అభివృద్ధికి సాంకేతిక సహాయం అందించబడుతుందన్నారు. వాటిలో అత్యుత్తమంగా నిలిచిన 10జట్లకు ప్రతి జట్టుకు రూ.5లక్షలు వరకు ప్రత్యేక నిధులు అందించి వారి ఆవిష్కరణలను విస్తృతస్థాయిలో అమలు చేసే అవకాశం కల్పించబడుతుందన్నారు. గత కోహోర్ట్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన మూడు విద్యార్థి బృందాలు ప్రోటోటైపింగ్ గ్రాంట్‌లు పొందారని, ఇది విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణాత్మక సామర్థ్యాన్ని, విజ్ఞాన్ అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని స్పష్టంగా తెలియజేస్తుందని తెలిపారు. అదే విధంగా స్టార్టప్ ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా ఎలా మలచుకోవాలో విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఆలోచనల దశ నుంచి అమలు దశ వరకు అనుసరించాల్సిన ప్రక్రియ, వ్యూహాలు, మార్కెట్ అధ్యయనం, వినియోగదారుల అవసరాల విశ్లేషణ వంటి అంశాలను స్పష్టంగా తెలియజేశారు. థింగ్‌క్యూబేటర్ స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు లభించే సాంకేతిక మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్, పరిశ్రమలతో అనుసంధానం, పెట్టుబడిదారులతో కలయిక, ప్రోటోటైప్ అభివృద్ధి, ఉత్పత్తుల వాణిజ్యీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఐడియా ధృవీకరణ, వ్యాపార నమూనా రూపకల్పన, మార్కెట్ విశ్లేషణ, వినియోగదారుల అభిప్రాయాల ఆధారంగా మెరుగుదల, విస్తరణ వంటి కీలక దశలను వివరించారు. వివిధ రంగాల్లో స్టార్టప్ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను థింగ్‌క్యూబేటర్ వేదికగా సమర్పించి, నిపుణుల మార్గదర్శకత్వంతో వాటిని సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలుగా మలచుకోవచ్చని తెలిపారు. కోహోర్ట్-9 ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన ఆలోచనలకు ప్రత్యేక శిక్షణ, మెంటార్‌షిప్, సీడ్ ఫండింగ్ అవకాశాలు కల్పించబడతాయని నిర్వాహకులు వెల్లడించారు. విశ్వవిద్యాలయం విద్యార్థుల్లో ఔత్సాహిక వ్యాపార దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనా శక్తి, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుదని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన నిర్మల ఫార్మసీ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు

**మంగళగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మంగళగిరిలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో, సి ఎస్ ఐ ఆర్ సహకారంతో నిర్వహించిన రెండవ రోజు ల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె. తేజోమూర్తి, మంగళగిరి ఎయిమ్స్ డా. అరూప్ కుమార్ మిశ్రా ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో టెక్నాలజీ, ప్రోటీన్ ఆధారిత డోసేజ్ అభివృద్ధి, ఏఐ ఆధారిత ఔషధ పరిశోధనలు భవిష్యత్తు ఫార్మసీ రంగాన్ని మలుపుతిప్పనున్నాయని తెలిపారు. విద్యార్థులు పరిశోధన దృక్పథాన్ని పెంపొందించుకొని అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలని సూచించారు. వర్చువల్ స్పీకర్ డా. రాఘవేంద్ర అశోక్ బోహారా డా. బి సుదీర్,ఆఫ్‌లైన్ స్పీకర్లు డా. శ్రీనివాస రెడ్డి, డా. జితేంద్ర పటేల్‌సదస్సులో తమ పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థులు, పరిశోధకులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. ఉత్తమ పరిశోధన పత్రాలకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు తమ ప్రతిభను




చాటుకొని గౌరవాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. నాగభూషణం, ప్రిన్సిపాల్, హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, డా. కిషోర్ బాబు, ప్రిన్సిపాల్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. హరే కృష్ణ రాయ్, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

## మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చెత్త రహిత




పాలన అనే థీముతో పట్టణంలో భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి సేకరించే చెత్తను తడి,పొడి చెత్తగా వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందించాలన్నారు. ప్రతి ఇంటిని, వీధిని శుభ్రం చేసుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. భారీ ఎత్తున విద్యార్థులు, స్కౌట్స్ అండ్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్వర్ణపురి పట్టణంలో సాగింది. సెయింటాన్స్ స్కూల్ ఎదురు ఏర్పాట్లు చేసిన పైలాన్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఇ వెంకయ్యచౌదరి, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.పోతురాజు, నాయకులు లక్ష్మీనారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

## -జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్ర



మంలో భాగంగా గోరంట్లలోని 184వ సచివాలయం పరిధిలో పలు చోట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటాలని కోరారు. రాష్ట్రంలో గుబురుశాతం పెరగాలంటే తప్పని సరిగా మొక్కలను నాటటడంతో పాటు వాటిని పరిరక్షించాల్సి బాధ్యతను కూడా ప్రతి పౌరుడు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి దూసుకుపోతుందన్నారు. గతంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి రాజేష్, యక్కిటల శ్రీను, స్థానిక ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** పట్టణంలోని పాతపొన్నూరు శ్రీరామా మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు అమెజాన్ సంస్థ పాఠశాలకు ఉచితంగా ల్యాప్‌టాప్‌ను బహూకరించింది. అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ (సీఎస్‌టిఈ) కార్యక్రమంలో భాగంగా శ్రీరామా మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జె.వెంకటేశ్వరరావు, 5వ తరగతి విద్యార్థులు ఎన్.యశస్విని, పి.సాయి శ్రీనిధి,



మణికంత, సంజీవ్ జిల్లా స్థాయి హ్యాకథాన్-2026కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కోడింగ్, క్రిటికల్ థింకింగ్ అంశాలు నేర్చుకునేందుకు అమెజాన్ సంస్థ పాఠశాలకు ల్యాప్‌ట్యాప్‌ను బహూకరించింది. మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ ఈ రోజు జరిగిన క్లస్టర్ సమావేశంలో ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయకుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్వీన్ బాబీకి జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పర్వీన్ బాబీకి జిల్లా రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలువురికి పదోన్నతలు కల్పించారు. అందులో పొన్నూరు సబ్‌రిజిస్ట్రార్ కూడా ఉన్నారు. పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఈమెను కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేసింది. స్థానిక కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పర్వీన్ బాబీ ఈ ప్రాంత ప్రజలు, అధికారుల మన్ననలను అందుకున్నారు.



వివాద రహిత అధికారిగా పేరు తెచ్చుకున్నారు. పదోన్నతి పొందిన పర్వీన్ బాబీని పలువురు ప్రముఖులు, సిబ్బంది అభినందించారు.

# మండే సుబ్రహ్మణ్యంకు ఉత్తమ కవి అవార్డు

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బోడపాడు గ్రామానికి చెందిన మండే



సుబ్రహ్మణ్యంకు ఉత్తమ కవిగా అవార్డు దక్కింది. మాతృభాషా దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. సుబ్రహ్మణ్యం కార్యక్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని చాటే లెస్స భాష విశ్వతార అనే శీర్షికతో స్వీయ కవితాలాపన చేశారు. సుబ్రహ్మణ్యం కవిత సాహిత్య, సంగీత, మాతృభాషాభిమానులను విశేషంగా ఆకట్టుకొంది. ఈ సందర్భంగా అతిథులు చేతుల మీదుగా మండే సుబ్రహ్మణ్యంకు అవార్డును అందజేశారు.

# మాజీ మంత్రి అంబటికి సంఘీభావం తెలిపిన కార్యకర్తలు

**పొన్నూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి



రాంబాబుకు పొన్నూరు నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం గుంటూరుకు తరలివెళ్ళి సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల అంబటి రాంబాబును అక్రమంగా, అన్యాయంగా కేసులు బనాయించి జైలులో ఉంచింది. 18రోజులపాటు జైలు జీవితం గడిపిన అంబటికి న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో జైలు నుంచి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అంబటిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతోపాటు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, చింతలపూడి మురళీకృష్ణ, షేక్ నాజర్, దేవరకొండ గోపి, నియోజకవర్గంలోని పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు భారీర్యాలీగా తరలి వెళ్ళి సంఘీభావం తెలిపినవారిలో ఉన్నారు.

# ఏఎన్‌యులో ఉద్రిక్తత

## - వీసిని కలిసిని అంబటి మురళీకృష్ణ - అడ్డుకున్న టిఎన్‌టియుసి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి21,ప్రభాతవార్త:** ఏఎన్‌యులో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకుల మధ్య ఘర్షణ వాతవరణం నెలకొంది. ఏఎన్‌యు ఇంజనీరింగ్ కళాశాలకు ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును గురువారం అధికారులు తొలగించారు. దీనిపై వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం ఆందోళన చేపట్టింది. అందులో భాగంగా శనివారం పొన్నూరు నియోజక వర్గ వైఎస్ఆర్‌పిసి ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ వర్సిటీ వీసిని కలిసేందుకు వచ్చారు. ఆయన రాకను టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. వర్సిటీ గేట్‌మూయించి అంబటిని వర్సిటీలోకి రానీయకుండ అడ్డుకునే ప్రయత్నం చేశారు. పెదకాకాని పోలీసుల జోక్యంతో అంబటితో పాటు మరో నలుగురికి వీసిని కలిసేందుకు అంగీకరించారు. మెయిన్‌గేట్ నుంచి వీసిని కలిసేందుకు వీసి కార్యాలయానికి అంబటి బృందం వెళ్ళింది. అక్కడ పరిపాలన భవనం వద్ద టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అంబటిని అడ్డుకున్నారు. కేవలం వినతిపత్రం ఇచ్చేందుకు మాత్రమే అనుమతి ఉందని పోలీసులు తెలుపడంతో అంబటి మురళీకృష్ణతో పాటు వర్సిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పఠాన్, ఇన్‌చార్జ్ డాక్టర్ పంతగాని రమేష్‌లు వీసి ఆచార్య కె.గంగాధరరావును కలిసి వినతిపత్రం అందించారు. వీసిగా రాజ్యాంగ పదవిలో ఉండి రాజకీయ నిర్ణయాలు తీసుకోవద్దని, వైఎస్ఆర్ పేరు తొలగింపు వెనుక రాజకీయ ప్రమేయం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. 2009లో వర్సిటీ పాలకమండలి తీసుకున్న నిర్ణయం ప్రకారం వైఎస్ఆర్ పేరును పెట్టారన్నారు. అది అమలులో ఉండగా పాలకమండలి నిర్ణయం లేకుండ, అకడమిక్ సెనేట్ ఆమోదం తెలుపకుండ వైఎస్ఆర్ పేరును ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వైఎస్ఆర్ పేరును తిరిగి



పురరుద్దించాలని కోరారు. అనంతరం వర్సిటీ ముఖద్వారం వద్ద విలేకరులతో మాట్లాడారు. నేడు పాలకులు వ్యక్తిగత స్వలాభం కోసం పనిచేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. వర్సిటీ తీసుకున్న నిర్ణయంతో వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతిందన్నారు. గతంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని కూల్చే ప్రయత్నం చేశారని, స్వార్థప్రయోజనాల కోసం రాజ్యాంగ బద్ధ పదవిగా ఉన్న వీసి హోదాకు తగ్గట్లుగా పాలన చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ పేరు పెట్టేవరకు తమ ఆందోళనలు ఆగవని హెచ్చరించారు. ఈ సందర్భంలో వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బండ్లమూడి భానుకిరణ్, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పెనుమాల అరుణ్‌కుమార్, వైసిపి విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# ఈనెల 26 నుండి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గంలో ఈనెల 26వ తేదీ నుండి ప్రారంభించబడుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నేత కొర్రపాటి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ..ఈ నెల 26వ తేదీ నుండి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాన్యశ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని తెలియజేశారు. ప్రతి జనసైనికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో పార్టీ సభ్యత్వాలు చేపట్టాలన్నారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని ఖీఉద్యమిఖీ గాను, పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి, పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని ఖీసాధకఖీ గాను, పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని ఖీప్రధాతఖీ గాను పిలుస్తారని ఇప్పటికే అధినాయకులు పవన్ కళ్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందేనన్నారు. మన అధినాయకులు150 మందితో పార్టీని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90వేలు సభ్యత్వాలు నమోదు చేశామని, ఎన్నికల ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరిందని, ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు నమోదుచేసి రికార్డు సృష్టించినట్లు గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు



వెంకటరత్తయ్య మాట్లాడుతూ గతంలో మన నియోజకవర్గం నుంచి షుమారుగా 9,600 సభ్యత్వాలు నమోదు చేయించామని చెప్పారు. ఈ నెల 26వ తేది నుండి సభ్యత్వాలు ప్రారంభం కానున్నాయి కాబట్టి నియోజకవర్గంలో అందరిని కలుపుకొని వీలైనన్ని ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేయటానికి కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి దేగల లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదుకు రూ.400లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలానే ఉద్యమి (వాలంటీర్)గా చేయువారు సమన్వయకర్త కొర్రపాటికి ఈనెల 23వ తేది లోపు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్లను అందజేయాలని సూచించారు. పట్టణ ఉపాధ్యక్షుడు చింతా రేణుకారాజు మాట్లాడుతూ డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు, ఉద్యమి లను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన వారిని అధికసంఖ్యలో సభ్యాత్వాలను నమోదుచేసే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి ఉదయ్, కార్యదర్శి పావులూరి కోటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు నాగం అంకమ్మరావు, విన్నకోట మల్లికార్జునరావు, దాసరి వాసు, యర్రంశెట్టి రాజేష్, సీనియర్ నేత పత్తి పాపారావు, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎనుముల రాంబాబు, పత్తి తంబి, కాకుమాను మండల కార్యదర్శి నాగరాజు, వీర మహిళలు సుహాసిని, ఏపూరి శ్రీదేవి, తదితర జన సైనికులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**కొల్లిపర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎంపిడివో విజయలక్ష్మి చెప్పారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్జీఎస్ఏ ద్వారా పంచాయతీల బలోపేతానికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ




ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అవసరమైన ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. సొంత ఆదాయ వనరులను సమీకరించుకోవడం వలన గ్రామాల అభివృద్ధి నెరవేరుతుందన్నారు .గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కార్యదర్శులు కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, డిప్యూటీ ఎంపిడివోలు భార్గవ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాలనీవాసులు గృహాల నిర్మాణం చేపట్టాలి

**కొల్లిపర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ళను నిర్మించుకోవాలని గృహనిర్మాణ శాఖ ఎఇ పద్మావతి చెప్పారు. శనివారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై లబ్ధిదారులు, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధి దారులు గృహాలు నిర్మించుకున్న వెంటనే నగదును వారి బ్యాంకు ఖాతాలలో జమచేస్తామని తెలిపారు. కాలనీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపిడివో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ



పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడివో దానయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 23,24తేదీల్లో కెఎల్‌యులో మహిళా సమ్మిట్

**తాడేపల్లి, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీలో ఈనెల 23,24తేదీల్లో అంతర్జాతీయ మహిళా సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు కెఎల్‌యు ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య శనివారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ మహిళా సమ్మిట్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సీతాశర్మ, రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ, డాక్టర్ నాన్సీ జునెజ తో పాటు పలువురు ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా కళాశాలల నుంచి మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో వక్తలు పాల్గొని మహిళా సాధికారత పైన, భవిష్యత్తులో రాబోయే కాలంలో మహిళల నాయకత్వం, ఆరోగ్యం, నూతన ఆవిష్కరణలలో మహిళల పాత్ర, పరిశ్రమల స్థాపన, టెక్నాలజీ, విద్యా, ఉద్యోగం, స్కిల్ డెవలప్‌మెంట్, మానవ హక్కులు, సామాజిక న్యాయం వంటి పలు అంశాలపైన చర్చించనున్నారని తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## ఎంపీడీవో రమేష్ బాబు

**వట్టిచెరుకూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రమేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం కొర్నెపాడులో శనివారం స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టిందన్నారు. అందరు తమ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిపించేందుకు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ




దివస్ ర్యాలీలో రోడ్లపై చెత్త వేయరాదని, తడి పొడి చెత్తను వేరుగా అందించాలని, ప్లాస్టిక్ వాడకం వద్దని, కాటన్ ముద్దు అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛభారత్ అనేది పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించే జాతీయోద్యమం అన్నారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ మిషన్ ద్వారా బహిరంగ మలవిసర్జన నిర్మూలన, ప్లాస్టిక్ రహిత గ్రామాలు మరియు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం ప్రజలను భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. 202627 నాటికి గ్రామీణ ప్రాంతాలను ఓడిఎఫ్ ప్లస్ గా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలని, రీసైక్లింగ్ తిరిగి ఉపయోగించడం లాంటి పద్ధతుల ద్వారా పర్యావరణ ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించి తమవంతు సహకారం అందించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దని పర్యావరణహిత వస్తువులనే వాడాలని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ కటకం శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ బాబురావు, ఆర్డబ్ల్యూఎస్ ఇన్చార్జ్ ఏఈ, అంగన్వాడి సూపర్వైజర్ చిన్నమ్మాయి, కార్యకర్తలు రాజకుమారి, రఘుకుమారి, నాగలక్ష్మి, మేరిమ్మ, శివమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 5 టిప్పర్ లారీలు సీజ్

**కొల్లిపర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాజధాని ప్రాంతం నుంచి వల్లభాపురం, మున్నంగి గ్రామాలకు అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న 5 టిప్పర్లను సీజ్ చేసినట్లు కొల్లిపర ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ తెలిపారు. శనివారం ఎఎస్ఐలు పోతురాజు, ప్రసాద్‌లతో కలసి ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ వాహనాలను తనిఖీ చేస్తుండగా నల్లమట్టి అక్రమ రవాణాకు సంబంధించిన టిప్పర్లను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



